
ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ కవితలతో వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి




# పనిస్తున్నరు.. పైసలివ్వట్లే..

*షేక్ గాలిబ్బి కడు పేదరాలు. ఈమెది చంద్రుగొండ మండలం మహ్మద్‌నగర్ గ్రామం. భర్తతో కలిసి కూలి పనులకు వెళ్లేనే పూటగడుస్తుంది. పిల్లలు వేరే ఉంటున్నారు. వ్యవసాయ కూలి పనులు చేయలేక ఉపాధి పనులకు వెళ్తున్నది. పని అయితే చేస్తున్నది కానీ.. రెండు నెలలుగా ఇంతవరకు కూలి సొమ్ములు రాలేదు. దీంతో పనిచేస్తూ కూడా పస్తులుండాల్సిన పరిస్థితి ఆ కుటుంబానిది. అసలే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మండిపోతున్నాయి. చేతిలో పైసలు లేక పచ్చడి మెతుకులు తిని బతుకుతున్నారు. పూట గడవడం కష్టంగా ఉందని గాలిబ్బి ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇది ఈమె ఒక్క కుటుంబానిదే కాదు.. జిల్లాలో చాలామంది కుటుంబాల పరిస్థితి ఇలానే ఉంది. ఉపాధి పనికి వెళ్తున్నప్పటికీ ఎన్నో కుటుంబాలు కరువులో కొట్టుమిట్టాడుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యం నీరుగారిపోతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోవడం లేదు.*

*– భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)*


చంద్రుగొండ: తిప్పనపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- రెండు నెలలుగా అందని కూలి డబ్బులు
- పస్తులుంటున్న ఉపాధిహామీ కూలీలు
- ఎండల్లో పనిచేసినా కనికరం చూపని ప్రభుత్వం
- పని ప్రదేశంలో కనీస వసతులూ కరువు..
- వేసవిలో కరువు పనులకు బోనస్ రానట్టే?
- నీరుగారుతున్న 'ఉపాధిహామీ' పథకం లక్ష్యం


చంద్రుగొండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

పేదలకు కూలి పనులు లేని సమయంలో పనులు కల్పించి ఉపాధి కల్పించడమే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రధాన ఉద్దేశం. కానీ.. ఇక్కడ అలాంటిదేమీ జరగడం లేదు. పనులు చేయించుకుంటున్నారు.. కానీ.. కూలి సొమ్ములు మాత్రం ఇవ్వడంలేదు. దీంతో ఉపాధిహామీ పనులపై కూలీలకు పూర్తిగా నమ్మకంపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 1,35,000 జాబ్‌కార్డులు ఉండగా.. అందులో ఉపాధి కూలీలు 2,14,776 మంది నమోదయ్యారు. కానీ.. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండడంతో 22 మండలాల్లో ఉపాధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 36,020 మంది మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు. రైతుల అవసరాలకు ఉపయోగపడే పనులు, సాగునీటి సంరక్షణ పనులపై కలెక్టర్ దృష్టి పెట్టడంతో అలాంటి పనులను మాత్రమే ఎంపిక చేశారు. దీంతో ఉపాధి కూలీలు ఫాంపాండ్, పొలం గట్లు, సోక్‌పిట్లు, ట్రెంచ్ కటింగ్ పనులు చేస్తున్నారు.

### పనుల వద్ద కనీస వసతులు కరువు..

వేసవికాలంలో పనులు అంటేనే ఎవరైనా వెనుకంజ వేస్తారు. ఉపాధి పనుల వద్ద నీడ లేకపోవడంతో ఎండలకు తట్టుకోలేకపోతున్నారు. ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు పంచాయతీ సిబ్బంది టెంట్లు వేయాల్సి ఉండగా ఎక్కడా నీడ సౌకర్యాన్ని కల్పించిన దాఖలాలు కనబడడం లేదు. అటవీ ప్రాంతంలో చేసే ట్రెంచ్ కటింగ్ పనుల వద్ద కూడా నీడ సౌకర్యాన్ని అధికారులు కల్పించడం లేదు. దీంతో కూలీలు ఎండలకు తట్టుకోలేక ముందుగానే ఇంటిముఖం పడుతున్నారు. ఎండలో సైతం పనులు చేస్తున్నప్పటికీ కూలి డబ్బులు సకాలంలో చెల్లించేందుకు అధికారులు కనికరం చూపడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

### వేసవిలో పనులకు బోనస్ రానట్టే..

వేసవికాలంలో ఉపాధిహామీ పనులు చేస్తే గతంలో బోనస్ ఇచ్చేవారు. కానీ.. ఈసారి బోనస్ ముచ్చట లేకపోవడం కాదు.. కనీసం కూలి సొమ్ములు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో కూలీలు హైరానా పడుతున్నారు. మండుటెండలో పనిచేస్తుంటే బోనస్ ఇవ్వకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా కూలీ డబ్బులు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానిది కమీషన్ల పాలన

- కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు
- రజతోత్సవ సభకు శ్రేణులు తరలిరావాలి: ఎమ్మెల్సీ తాతా
- ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రవికి పరామర్శ

కొణిజర్ల, ఏప్రిల్ 18: ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కమీషన్ల రాజ్యం నడుస్తున్నదని, మంత్రులందరూ తమ స్థాయికి తగ్గట్లు తీరొక్క దందాలకు పాల్పడుతున్నారని, కాంట్రాక్టర్ల నుంచి 10 నుంచి 12 శాతం కమీషన్లు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆరోపించారు. రామనర్సయ్యనగర్‌లో ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బీఆర్ఎస్ కార్యకర్త జటపిట రవిని శుక్రవారం ఆయన పరామర్శించారు. కారణాలు అడిగి తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదన్నారు.

అనంతరం బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే సత్తా కూడా లేదన్నారు. 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బహుబలి కేసీఆర్ బయటకు రానున్నారని, కాంగ్రెస్ పతనానికి ఈ సభ వేదిక కానుందని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం రామనర్సయ్యనగర్‌లో వడ్డెర సంఘం కమ్యునిటీ హాల్ నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.5 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. జటపిట రవికి రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. అనంతరం రైతులు ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఎటువంటి తరుగు లేకుండా పూర్తి పైకం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పోట్ల శ్రీనివాసరావు, కొర్రా కాంతమ్మ, ముత్యాల నాగేశ్వరరావు, కిలారు మాధవరావు, దొడ్డపునేని రామారావు, పోగుల శ్రీను, పాసంగులపాటి శ్రీను, ముత్యాల నాగేశ్వరరావు, అద్దంకి చిరంజీవి, రాయల నాగేశ్వరరావు, బానోతు రాంబాబు, దావా విజయ్, షేక్ సోందు, భూక్యా రాందాస్, జర్పుల వెంకన్న, నున్నా రామకృష్ణ, రహీం, రవీంద్ర, వెంకటచలం, బైరు వెంకటేశ్వర్లు, బాలు పాల్గొన్నారు.


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

# సమస్యల పరిష్కారానికి 'భూ భారతి'

- ఖమ్మం ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- నేలకొండపల్లి మండలంలో రెవెన్యూ సదస్సుల తనిఖీ

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 18: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ అన్నారు. గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం, కొత్త కొత్తూరు గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, రిజిస్ట్రార్లు దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అభద్రతా భావానికి తావీయకుండా జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు, పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు ఇందులో పరిష్కారం లభిస్తుందన్నారు. తప్పుల సవరణకు హక్కులు ఉండి.. రికార్డులలో లేనివారు హక్కుల రికార్డులలో నమోదు చేసుకోవడానికి కొత్త చట్టం వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చెరువుమాదారంలో చేపట్టిన సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 160, కొత్త కొత్తూరు గ్రామంలో 28 దరఖాస్తులు స్వీకరించి రైతులకు రశీదులు అందజేశారు. అలాగే సదాశివపురంలో నిర్వహించిన సదస్సులో 46 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రాజేశ్వరి, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, అఫ్జల్ హుస్సేన్, నయాబ్ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐలు శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ

# అది వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ కాదు.. ముస్లింలపై కక్షసాధింపు

- వక్ఫ్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి
- జిల్లా వ్యాప్తంగా ముస్లిం సంఘాల నిరసనలు

**రామవరం/ ఖమ్మం/ భద్రాచలం/ కూసుమంచి, ఏప్రిల్ 18:** కేంద్ర ప్రభుత్వం తెచ్చింది వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లు కాదని.. అది ముస్లింలపై కక్షసాధింపు బిల్లని వివిధ ముస్లిం సంఘాల నేతలు, మత పెద్దలు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై కక్షసాధింపు చర్యతో లౌకిక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఇలాంటి మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ముస్లిం సంఘాల నాయకులు, మత పెద్దలు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు. భద్రాద్రి జిల్లా రామవరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కూసుమంచిలో మానవహారం చేపట్టారు. ఖమ్మంలో ప్రదర్శన చేపట్టి 'రాజ్యాంగాన్ని పరిరక్షిద్దామని, వక్ఫ్‌చట్టాన్ని తిరస్కరిద్దామని నినాదాలు చేశారు.


కూసుమంచిలో మానవహారం చేస్తున్న ముస్లింలు

# యేసయ్యా.. మీ త్యాగం అజరామరం..

- 'గుడ్‌ఫ్రైడే' ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవ బోధకులు
- ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో 'శుభశుక్రవారం'

'యేసయ్యా.. మీ త్యాగం అజరామరం.. మీ మార్గం అనుసరణీయం..' అంటూ క్రైస్తవ బోధకులు క్రీస్తు త్యాగాలను విశ్వాసులకు బోధించారు. మనుషులు చేసిన పాపాలకు బలిగా తన ప్రాణాన్ని అర్పించి సిలువ మరణం పొందిన రోజుగా క్రైస్తవ భక్తులు జరుపుకునే గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్థనా మందిరాల్లోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తుకు మరణశిక్ష విధించే క్రమంలో శిలువ మార్గపు సన్నివేశాలను ప్రదర్శించారు. క్రైస్తవ భక్తులు వాటిని చూసి కంటతడి పెడుతూ ప్రార్థనలు చేశారు. అలాగే, గత 40 రోజులుగా కొనసాగించిన ఉపవాస దీక్షలను శుక్రవారం విరమించారు. చర్చిలకు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలు ఆచరించారు. ఈ సందర్భంగా క్రైస్తవ బోధకులు బైబిల్ వాక్యాలను ఉపదేశించారు. గుడ్‌ఫ్రైడే అనేది.. దేవుడికి మానవుడికి.. అలాగే, మానవుడికి మానవుడికి మధ్యగల ప్రేమ బంధాన్ని చాటుతుందని బోధించారు. మానవులందరూ పాపాలను దరిచేరనీయకూడదని, ప్రేమతో జీవించాలని, దేవుడి మార్గాన్ని అనుసరించాలని ఉపదేశించారు.

**–నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 18**


ఖమ్మంలో సిలువమార్గ సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవ విశ్వాసులు







